మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మాజీ మంత్రి పరామర్శ

మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు, జనవరి 10 : పెబ్బేరు మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ కుటుంబాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఆమె మామ ఎద్దుల రాములు అనారోగ్యంతో మరణించిన నేపథ్యంలో నిరంజన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి కుమారుడు సాయినాథ్‌ను ఓదార్చారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కర్రెస్వామి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యస్థాపనకు పండుగ సాయన్న కృషి

రాయినిపల్లిలో పండుగ సాయన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

పాన్‌గల్, జనవరి 10 : పండుగ సాయన్న ఆనాటి నిజాం నిరంకుశ అధికారులను ప్రశ్నించి, ఎదురించి సొంతపాలన వ్యవస్థను స్థాపించుకొని బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన మహనీయుడని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ముదిరాజ్ రాష్ట్ర నాయకులు నీలం మధు అన్నారు. శుక్రవారం మండలంలోని రాయినిపల్లి గ్రామంలో పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగ సాయన్న పేదలకు దానధర్మాలు చేసేవాడని, ప్రజలను దోచుకుంటున్న దొరలు, దేశ్‌ముక్‌లు, నిజాం అధికారులను ఎదురించి తగిన బుద్ధి చెప్పేవారని తెలిపారు. విద్య ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమ ని, ప్రతిఒక్కరూ చదువుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు పగిడాల శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్, చెన్నరాములు, పుట్ట బాలరాజు, వాకిటి ఆంజనేయులు, కృష్ణ, ఎల్లయ్య, ఈర్ల శ్రీనివాసులు, బయ్య వెంకటస్వామి, పెబ్బేటి కృష్ణయ్య, వెంకటస్వామి, శివప్రసాద్, సింగోటం, మెట్టుకాడి శ్రీనివాస్, రవి, బాలస్వామి పాల్గొన్నారు.

ఆత్మకూర్‌ను అభివృద్ధి చేసుకుందాం

ఆత్మకూర్, జనవరి 10: జనాభాపరంగా, వ్యాపారపరంగా దినదినం పెరిగిపోతున్న ఆత్మకూర్‌ను రాజకీయపార్టీలకు అతీతంగా కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆత్మకూర్ పట్టణంలోని డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్‌ను, మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన పార్కును మున్సిపల్ చైర్‌పర్సన్ గాయిత్రీరవికుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకం తల్లి లాంటిది

- ప్రముఖ కవి జనజ్వాల

పెబ్బేరు, జనవరి 10: పుస్తకం కన్నతల్లి లాంటిదని దాన్ని ఎప్పటికీ విస్మరించరాదని ప్రముఖ కవి జనజ్వాల అన్నారు. శుక్రవారం పెబ్బేరు మండలం యాపర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతి విద్యార్థి పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తకాన్ని మాతృమూర్తి కన్నా గొప్పగా చూసుకోవాలని, విజ్ఞానికే గాకుండా భవిష్యత్తును తీర్చిదిద్దేది కూడా పుస్తకమేనని చెప్పారు. పుస్తకాలు విరివిగా చదవడం వల్లే గాంధీజీ, అంబేద్కర్ లాంటి వాళ్లు గొప్పవాళ్లయ్యారని తెలిపారు. పాఠశాల లైబ్రరీలో కథల పుస్తకాలతో పాటు, జాతీయ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలు కూడా ఉండాలన్నారు. పుస్తక పఠనాన్ని జీవితంలో ఒక భాగంగా చేసుకొనే వారు ఉన్నత స్థాయికి రాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో చిన్నారి చేరిక

వనపర్తి టౌన్, జనవరి 10: జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో వైకల్యం కలిగిన చిన్నారిని శుక్రవారం చేర్పించినట్లు జిల్లా జడ్జి వి.రజిని తెలిపారు. మేధోసంబంధ వైకల్యం కలిగిన వారిని పాఠశాలలో చేర్చడంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. న్యాయ సేవాసాధికార సంస్థకు యాదమ్మ అనే మహిళ తన కూతురు మానసిక వైకల్యంతో బాధపడుతుందని మాటలు సరిగా రావడం లేదని, ఐదేండ్ల వయసు ఉందని చదువు చెప్పించాలని కోరిందన్నారు. వెంటనే భవిత కేంద్రాన్ని సంప్రదించి చిన్నారిని భవానీని పాఠశాలలో చేర్పించామన్నారు. 19ఏండ్లలోపు మానసిక వైకల్యం, బుద్ధిమాంద్యతతో బాధపడే పిల్లలు ఉంటే వారి తల్లిదండ్రులు సంప్రదించాలని జడ్జి సూచించారు. కార్యక్రమంలో లీగల్ వలంటీర్లు మధు, హెచ్ఎం అనురాధబాయి, భవిత కేం ద్రం నిర్వాహకురాలు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ధరూరు, జనవరి 10 : గురుకుల ప్రవేశ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు ప్రత్యేక తయారు చేసిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మండలంలోని ర్యాలంపాడు యూపీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం ఉపాధ్యాయుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుకుల ప్రవేశ పరీక్షకు తయారయ్యే విద్యార్థుల కోసం స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు శాంతన్న, కృష్ణ, ఈరన్న, భాస్కర్, రాజు, సల్వాపురం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

108 సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా మేనేజర్ రత్నమయ్య

అలంపూర్ చౌరస్తా, జనవరి 10 : జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 108 అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మేనేజర్ రత్నమయ్య అన్నారు. శుక్రవారం ఉండవెల్లిలో అంబులెన్స్‌ను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఎక్కడ ఎమర్జెన్సీ ఉన్నా ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సేవలందిస్తామన్నారు. కాల్‌సెంటర్ నుంచి ఎమర్జెన్సీ కేసు వచ్చిన వెంటనే సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రమాదస్థలంలో చేరుకొని బాధితులకు దవాఖానకు తరలించే బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజలందరూ 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ కల్పన, పైలట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఖిల్లాఘణపురం, జనవరి 10: కేజీబీవీల్లో చదవుతున్న విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ తెలుగు, ఇంగ్లిష్ మీడియం పాఠశాలలను ఆయన సందర్శించారు. ముందుగా వంటగది, స్టోర్ రూం, వండిన భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం, భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటిస్తూ వారికి ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు , గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో జయశంకర్, మండల పరిషత్ అధికారి రాజు, క్లస్టర్ సీఆర్పీ వెంకటేశ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగోలి

గోపాల్‌పేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

అయిజ పాఠశాలలో సంక్రాంతి సంబురాలను నిర్వహిస్తున్న చిన్నారులు

వనపర్తి టౌన్, జనవరి 10 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో రంగుల పోటీలను నిర్వహించారు. సంక్రాంతి ఉట్టిపడే విధంగా గంగిరెద్దులు, భోగి మంటలు, చెరుకు గడలు, పాలపొంగు, కొత్త పంట ఇంటికి వచ్చే విధానాన్ని ప్రతిభింబిస్తూ రంగురంగుల ముగ్గులతో అలంకరించి హరివిల్లును వేశారు. స్కాలర్స్, సీవీ రామన్, జాగృతి, గాయత్రి బీఈడీ కళాశాలల్లో రంగోలి వేశారు. రంగోలిలో విజేతలైన వారికి బహుమతుల ప్రదానం చేశారు.

చిట్యాల స్కూల్‌లో..

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చిట్యాల ప్రభుత్వ పాఠశాలలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. అందులో విజేతలకు డీఈవో అబ్దుల్ ఘని బహుమతులను ప్రదానం చేశారు. చెలిమి సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగాధిపతి గణేశ్, జీహెచ్ఎం చంద్రశేఖర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చం ద్రశేఖర్, గిరిరాజాచారి, రవి, సంజీవయ్య, రుద్రమదేవి, షఫి, గాయత్రి కళాశాల అధ్యాపకులు ఎస్‌కే వలి, మోహన్, మల్లికార్జున్, రాము ఉన్నారు.

పాఠశాలలో ముగ్గుల పోటీలు

గోపాల్‌పేట, జనవరి 10 : సంకాంత్రి పండుగను పురస్కరించుకొని మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో 25 మంది విద్యార్థినులు పాల్గొనగా ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహాలక్ష్మి, రమాదేవి, వీరమణి, షబానా, సునీత, చెన్నపద్మ, లక్ష్మి, ప్రవీణ, మహేశ్వరీ అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా ఘణపురంలో మండలంలో..

ఖిల్లాఘణపురం, జనవరి 10 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం శనివారం నుండి సెలవులు ప్రకటించింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మండలంలోని కమాలుద్దీన్‌పూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన రంగోళి కార్యక్రమానికి ఎంపీడీవో వెంకటాచారి, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిలు హాజరై బహుమతులు ప్రదానం చేశారు.

ముందస్తు సంక్రాంతి సంబురాలు

అయిజ, జనవరి 10 : పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల, జీవీఆర్ఎం పాఠశాలల్లో విద్యార్థులు హరిదాసుల వేషాధారణలతో అలరించారు. పలువురు విద్యార్థినులు ముగ్గులు వేశారు. సంక్రాంతి వేళ పంటలు చేతికొచ్చి ప్రజలు సంక్రాంతి పండుగను ఏ విధంగా జరుపుకొంటారో కండ్లకుగట్టినట్లు అవగాహన కల్పించారు. గాలి పటాలు ఎగురవేసి, రేగుపండ్లను శిరస్సుపై పోసి చిన్నారులను ఆశీర్వదించారు. ముగ్గులపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాఘవేంద్రరావు, హెచ్ఎంలు మధుసూదన్‌రెడ్డి, సతీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదోపటాలంలో ..

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 10 : మండలంలోని పదోపటాలంలో సాయిధచైతన్య పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో భోగి మంటలు ఏర్పాటు చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి ముగ్గులు వేశారు. నువ్వుల రొట్టెలు చేసి విద్యార్థులు ఆరగించారు. చిన్నారుల ఆట పాటలు చూపరులను అలరించాయి.

ఎద్దులబండిని ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

- ఇద్దరు రైతులకు తీవ్రగాయాలు

అలంపూర్ చౌరస్తా, జనవరి 10 : పొలం పనులకు ఎద్దులబండిపై వెళ్తున్న రైతులకు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం అలంపూర్ చౌరస్తాలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. ఉండవెల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, మద్దిలేటి అలంపూర్ చౌరస్తాలో ఉన్న పొగాకు పొలంలో పొగాకుబండలు తీసుకురావడానికి గ్రామం నుంచి ఎద్దులబండిపై బయలుదేరారు. అలంపూర్ చౌరస్తా సమీపంలో 44వ జాతీయ రహదారిపై వెళ్తుండగా వెనకాల నుంచి గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో ఎద్దులబండి రహదారిపై నుంచి పల్టీలు కొడుతూ కిందకు పడిపోయారు. ప్రమాదంలో ఇద్దరు రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని వారిని చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఎద్దుకు కూడా గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వనపర్తి టౌన్ , జనవరి 10 : మండలంలోని సవాయిగూడెం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై జలందర్‌రెడ్డి తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించామని ఊడిగచెట్టుకు ఆ వ్యక్తి ధరించిన పంచె అంచుతో గొంతుకు ఉరివేసుకున్నట్లు కనిపిస్తుందన్నారు. శవం పూర్తిగా కుళ్లిపోయి తెల్లని చొక్కాపై జీటీ ప్యాషన్ టైలర్ మార్కు కలిగి ఉందని, నడుముకు ఎర్రని మొలతాడు ఉందని, ఇస్సా కంపెనీ అండర్‌వెయిర్, జేబులో సున్నం డబ్బా, పొగాకు కలిగిన తెల్లటి ప్లాస్టిక్ కవర్ ఉందన్నారు. శవం పక్కనే చలికోటు తెల్లని పంచా, నల్లని అద్దాలుపడి ఉన్నాయని, 30నుంచి 40 రోజుల మధ్య మరణించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. గుర్తుతెలియని మగ శవం 45ఏండ్ల వయస్సు ఉంటుందని, ఎవరైనా గుర్తిస్తే రూరల్ పోలీస్‌స్టేషన్ 8712670613, వనపర్తి సీఐ 8712670611 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

సైబర్ కేసు నమోదు

గోపాల్‌పేట, జనవరి 10 : సైబర్ మోసగాడి మాయమాటలు నమ్మి ఓ వ్యక్తి రూ.35వేలు పోగొట్టుకున్న ఘటన మండలంలోని నర్సింగాయపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు..నర్సింగాయపల్లి గ్రామానికి చెందిన పసుపుల చెన్నకేశవులుకు గతేడాది నవంబర్ 26న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి యాప్ ద్వారా మాట్లాడుతున్నాం, మీకు రూ. 3లక్షల 55వేలు మంజూరయ్యాయని, ఆ డబ్బులు మీఅకౌంట్లోకి రావాలంటే ఇన్సూరెన్స్, జీఎస్టీ, టీడీఎస్ కలిపి రూ. 35వేలు ఫోన్ పే ద్వారా పంపించాలని కోరాడు. అతడి మాయమాటలు నమ్మిన చెన్నకేశవులు ఫోన్‌పే ద్వారా వారికి డబ్బులు పంపిచాడు. ఇవి సరిపోవు ఇంకా పంపించాలని అడుగగా, చెన్నకేశవులుకు అనుమానం వచ్చింది. ఫోన్‌లో మాట్లాడుతుండగానే గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ కట్ చేసి, స్విచ్ ఆఫ్ చేశాడు. మోసపోయానని గ్రహించిన చెన్నకేశవులు 1930 సైబర్ క్రైం నెంబర్‌కు ఫోన్ చేశాడు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్దకల్, జనవరి 10 : మండలంలోని ఉల్గెపల్లి – దాసరిపల్లి గ్రామాల మధ్య గత నెల 23వ తేదీన రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో నాగప్ప (58) అనే వ్యక్తి హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్సై నందికర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం దాసరిపల్లి గ్రామానికి చెందిన నాగప్ప గత నెల 23వ తేదీన పనులు నిమిత్తం ఉల్గెపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి గ్రామానికి రాత్రి 9గంటల సమయంలో బైక్‌పై పై తిరిగి వస్తుండగా అదే సమయంలో ఉల్గెపల్లి గ్రామానికి చెందిన బోయ నర్సింహులు తన బైక్‌తో ఢీ కొట్టడంతో త్రీవ గాయాలయ్యాయన్నారు. వెంటనే గద్వాల దవాఖానకు కి చికిత్సకు తరలించగా పరిస్థితి విషమించడంతో గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఇప్పుడు మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు రఘుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తేలు ఉన్నట్లు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

హెచ్ఎంపీవీపై ఆందోళన వద్దు

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

గద్వాలటౌన్, జనవరి 10 : హెచ్ఎంపీవీ వైరస్‌పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సిద్ధప్ప సూచించారు. జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్యాధికారులులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎంపీవీ వైరస్ అనేది 2001నుంచి ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడిన శ్వాసకోస వ్యాధి అని అందరికి తెలుసునన్నారు. కాని ఈ వైరస్ చైనాలో వ్యాప్తిచెందడంతో అందరిని దృష్టిని ఆకర్షించిందని చెప్పారు. శీతాకాలంలో, వసంత రుతువు ప్రారంభసమయంలో శ్వాసకోస వ్యాధి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కాబట్టి వైరస్ ఎలాంటి ముప్పులేదన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. అలాగే గతేడాది కంటే ఎక్కువగా ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహించేందుకు లక్ష్యంగా పెట్టుకుని ముందుకు పోవాలని సూచించారు. బీపీ, షుగర్ ఎక్కువగా ఉన్నవారిని గుర్తించి ఆరోగ్య కేంద్రాలకు తరలించాలన్నారు. సాధారణ కాన్పుల పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో డాక్టర్లు సంధ్యాకిరణ్, రాజు, ప్రసన్నరాణి పాల్గొన్నారు.

ప్రయాణికులతో బస్టాండ్ కిటకిట

- సంక్రాంతి సెలవులకు స్వగ్రామాలకు తరలిన విద్యార్థులు

బస్సుల కోసం ఎగబడిన విద్యార్థులు, తల్లిదండ్రులు

వనపర్తి టౌన్, జనవరి 10 : సంక్రాంతిని పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 11 నుంచి 17 వరకు సెలవులు ప్రకటించింది. దీంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి పాఠశాలలు, కళాశాలలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలల విద్యార్థులు తమ ఇండ్లకు వెళ్లేందుకు బస్టాండ్ ప్రాంగణానికి చేరుకున్నారు. బస్టాండ్‌లో సందడి సందడిగా నెలకొన్నది. చిన్నారులను తమ ఇండ్లకు తీసుకెళ్లేందుకు పాఠశాలలు, కళాశాలలకు చేరుకొని బ్యాగులు, పెట్టేలు నెత్తిన పెట్టుకొని బస్టాండ్‌కు వెళ్లారు. బస్సులోని సీట్ల కోసం ఎగబడ్డారు. సెలవులు ప్రకటించడంతో హాస్టళ్ల విద్యార్థులు తమ సొంత ఊర్లకు వెళ్లేందుకు విద్యార్థులు బస్సుల కోసం తరలివచ్చారు

ఇందువాసి శివారులో సోలార్‌ప్లాంట్?

ఇందువాసి శివారులో సోలార్‌ప్లాంట్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేస్తున్న అధికారులు(ఫైల్)

- భూమి పరిశీలన చేసిన అధికారులు
- మహిళా సమాఖ్య, గ్రామ సంఘానికి అప్పగింత
- కలెక్టర్‌దే తుది నిర్ణయం

గట్టు, జనవరి 10 : మండలంలోని ఇందువాసి శివారులో సోలార్‌ప్లాంట్ నిర్మాణం జరుగనున్నది. దీనికి సంబంధించి రెవెన్యూ, విద్యుత్‌శాఖ, ఐకేపీ అధికారులు గురువారం స్థల పరిశీలన చేశారు. ఇందువాసిలో 753 సర్వే నెంబర్‌లో 222 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండగా, దీంట్లో 100 ఎకరాలు మిగులు భూమిగా ఉన్నది. ఇదిలా ఉండగా మహిళా సమాఖ్యలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ సోలార్ ప్లాంట్ నిర్వహణ బాధ్యతను మహిళా సంఘం, గ్రామం సంఘానికి అప్పగించనున్నారు. తద్వారా ఆర్థిక పరిపుష్టిని అందించాలని సంకల్పించారు. ఇదిలా ఉండగా సోలార్‌ప్లాంట్‌కు 20ఎకరాలు భూమిని సేకరించనున్నారు. సబ్‌స్టేషన్‌కు నాలుగు కిలోమీటర్ల పరిధిలోనే భూమిని సేకరించి ప్లాంట్‌ను ఏర్పాటుచేయనున్నారు. 5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను ఇందువాసిలో ఉన్న సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేయనున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోకన్నా గట్టు, కేటీదొడ్డిలలోనే ప్రభుత్వ భూమి అధికంగా ఉండడంతో సోలార్ ఏర్పాటుపై గట్టుపైనే ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇదిలా ఉండగా ఈనెల 17వ తేదీన కలెక్టర్ జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి దీనిపై తుది నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. అయితే సోలార్ ప్లాంట్ ఏర్పాటు నిజమని, అయితే అది ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయం తమకు తెలియదని అధికారులు చెబుతున్నారు.

ఘనంగా బీఆర్ఎస్ నాయకుడి జన్మదినం

మల్దకల్ ఆలయం ఎదుట కేక్ కట్ చేస్తున్న బాసు హన్మంతు నాయుడు

గట్టు, జనవరి 10 : బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బీఆర్ఎస్ నాయకులు స్థానిక పీహెచ్‌సీలో రోగులు, గర్భిణులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ఎల్లవేళలా పాటుపడే హన్మంతు మరిన్ని పుట్టిన రోజులు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు అంగడి బస్వరాజు, నూర్‌పాషా, రాముడు నాయుడు, బాసు గోపాల్, కృష్ణ, రాజునాయుడు, బాసునాయుడు, రవి, జమ్మన్న, మీదింటి కృష్ణ, రంగస్వామి, పాండు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్ మండలంలో..

మల్దకల్, జనవరి 10 : జోగుళాంబ గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బాసుహన్మంతు నాయుడు జన్మదిన వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో ఆలయం ఎదుట కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బాసు హన్మంతు నాయుడు, బాసు శ్యామల దంపతులు హాజరై కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించుకున్నారు. వీరిని కార్యకర్తలు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రచార రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శేఖర్ నాయుడు, తిరుమల్ నాయుడు, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు నివేదిత విద్యార్థి

జాతీయ సైన్స్ ఫెయిర్‌కు ఎన్నికైన మణికంఠను అభినందిస్తున్న కరెస్పాండెంట్ ఆకుల లక్ష్మి

కొత్తకోట, జనవరి 10: పట్టణ కేంద్రంలోని నివేదిత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి మణికంఠ జాతీయ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. జడ్చర్ల, పోలేపల్లి సెజ్ ఎస్.వీ.కే.ఎం. పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ సందర్భంగా మణికంఠను, సైన్స్ బోధించే ఉపాధ్యాయుల ను పాఠశాల కరెస్పాండెంట్ ఆకుల లక్ష్మి, యాజమాన్య బృందం, ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

న్యాయం చేయండి మహాప్రభో..

- కాంగ్రెస్ నేతలు, అయిజ ఎస్సై భయాందోళనకు గురిచేస్తున్నారు
- న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యం
- సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన ఏజీజీకే బాధితుడు నరేంద్ర

అయిజ, జనవరి 10 : అధికార పార్టీకి చెందిన నాయకులు, అయిజ ఎస్సై భయాందోళనకు గురిచేస్తున్నారని, న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు ఏజీజీకే బాధితుల్లో ఒకరైన నరేంద్ర సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్ అయ్యింది. వివరాలిలా.. అయిజ పట్టణంలో గుజరాత్‌కు చెందిన వ్యక్తితో కలిసి తూంకుంటకు చెందిన గజేంద్రగౌడ్ గతేడాది ఏజీజీకే ట్రేడర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. ఇందుకుగానూ పెట్టుబడుల కోసం రూ.60 లక్షలు కావాలని, అందుకు 3.33 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తానని, తన స్నేహితుడైన అయిజకు చెందిన నరేంద్రను సంప్రదించాడు. నరేంద్ర తన వద్ద డబ్బులు లేవని, అయిజకు చెందిన తెలుగు లక్ష్మిని సంప్రదించాడు. రూ.40 లక్షలు ఇస్తాం.. భూమి రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించగా.. గజేంద్రతో చేయించారు. మరో రూ.20 లక్షలు అడగగా, మరో వ్యక్తి వద్ద ఇప్పించాడు. ఆరు నెలలుగా రూ.60 లక్షలు చెల్లించకపోగా, కేవలం రూ.18 లక్షలు మాత్రమే ఇచ్చాడు. ప్రస్తుతం భూమి కొనుగోలు చేసిన తెలుగు లక్ష్మి, రూ.20 లక్షలు ఇచ్చిన వ్యక్తి డబ్బుల కోసం మధ్య వర్తిగా ఉన్న నరేంద్రను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గజేంద్ర, కాంగ్రెస్ నాయకులు, ఎస్సై విజయ్ భాస్కర్ భూమి తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితుడు వాపోయాడు. డబ్బులు ఇవ్వకుండా భూమి రిజిస్ట్రేషన్ ఎలా చేయించాలని లక్ష్మి ప్రశ్నిస్తుండగా, చేయించాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని బాధితుడు తెలిపాడు. వేధింపులు తట్టుకోలేనని, తనకు చావే శరణ్యమని భావిస్తున్నట్లు మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను వేడుకొన్నాడు. ఈ విషయమై వివరణ కోరగా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని, బాధితుడు తమను సంప్రదిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని శాంతినగర్ సీఐ టాటాబాబు తెలిపారు.

చైనా మాంజా విక్రయించినా.. వినియోగించినా చర్యలు

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, జనవరి 10 : నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రావుల గిరిధర్ శుక్రవారం ప్రకటనలో హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చైనా మాంజ ఎక్కువగా విక్రయించే దుకాణాలపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని, నైనాల్, సింథటిక్ ధారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలతో పర్యావరణానికి విపత్తుగా మారడంతోపాటు, చైనా మాంజ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. చైనా మాంజను ఉపయోగించి గాలి పటాలు ఎగురవేసే క్రమంలో ఎన్నో పక్షులు, సాధారణ ప్రజలు ప్రమాదానికి గురవుతున్నారని, అదే క్రమంలో గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడా ప్రమాదానికి గురైన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. చైనా మాంజపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిందని, పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం అమ్మినా, కొనుగోలు చేసేనా నేరమేనని చైనా మాంజను అమ్మితే ఏడేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో చైనా మాంజా విక్రయాలు జరుగకుండా తగు చర్యలు తీసుకున్నామని, ప్రజలు కూడా చైనా మాంజా వినియోగించుకుండా ఎవరికి హానీ కలగని సాధారణ ధారంతో గాలిపటాలను ఎగురవేసుకోవాలని సూచించారు. ఎవరైనా చైనా మాంజాను విక్రయించినా, కొనుగోలు చేసి ఎగురవేసినా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నేడు జములమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

గద్వాల రూరల్, జనవరి 10 : నడిగడ్డ ఇలవేల్పు జమ్ములమ్మ ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించనున్నట్లు ఈవో పురందర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొని, నూతన చైర్మన్ వెంకట్రాములు చేత ప్రమాణం చేయించనున్నట్లు తెలి పారు. ఉదయం 11గంటలకు జరిగే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో తెలిపారు.

అట్టహాసంగా క్రికెట్ పోటీలు ప్రారంభం

గోపాల్‌పేట, జనవరి 10 : మండల కేంద్రంలోని హనుమాండ్ల గడ్డలో ప్రీమియర్ లీగ్ సీజన్ –2 క్రికెట్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, హనుమాండ్ల గడ్డ కాలనీ పెద్దలు సంగనమోని బాలయ్య, కొంకలి వెంకటేశ్, శరత్ బాబు ప్రారంభించారు. ఈనెల 14 వ తేదీ వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. టోర్నీ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ. 5వేల నగదుతో పా టు మెమెంటోలు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

క్రీడల్లో యువత రాణించాలి

మల్దకల్, జనవరి 10 : యువత క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం మండలంలోని పాల్వాయి, ఎల్కూర్ గ్రామాల్లో ఆయా గ్రామాలకు చెందిన యువకులు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీలను సరిత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్ని పోటీలను స్నేహ పూర్వకంగా ఆడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణ, వెంకటేశ్, ఎల్కూర్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి భూమిపూజ

పాన్‌గల్, జనవరి10: మండలంలోని కేతేపల్లి గ్రామంలో హెల్త్‌సబ్ సెంటర్ నిర్మాణానికి శుక్రవారం పంచాయతీరాజ్ ఏఈ విజయ్‌కుమార్, పంచాయతీకార్యదర్శి పరుశరాం, నాయకులు విష్ణు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో గ్రామానికి పీహెచ్‌సీకి రూ.20లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పనులు నాణ్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో డబ్బా వెంకటయ్య, వెంకటస్వామి, గోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్టేషనరీ వస్తువులకు దరఖాస్తులు

వనపర్తి టౌన్, జనవరి 10: గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికల్లో భాగంగా స్టేషనరీ షాపు యజమానుల నుంచి షీల్డ్ కవర్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. టెండర్ దరఖాస్తు ఫారాలు విడివిడిగా ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు జిల్లా పంచాయతీ కార్యాలయంలో లభిస్తాయని 22వ తేదీ సాయంత్రం 4గంటల వరకు షీల్డ్ కవర్ టెండర్లు దాఖలు చేయాలన్నారు. ఈనెల 23న ఉదయం 11గంటలకు అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో షీల్డ్ కవర్లను ఓపెన్ చేస్తారని, ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా పంచాయతీ కార్యాలయం కలెక్టరేట్‌లో సంప్రదించాలని చెప్పారు.